

నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు, నాయకులు

నిర్వాసితుల పోరుబాట

- 765కేవీ లైన్ వేయొద్దని నేటి నుంచి రిలే దీక్షలు
- అలైన్మెంట్ మార్పునకు ఆందోళన కార్యక్రమాలు

కడ్తాల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పంట పొలాల మీదుగా వెళ్తున్న 765కేవీ విద్యుత్ లైన్ అలైన్మెంట్‌ను మార్చాలని నిర్వాసిత రైతులు పోరాబాటకు సిద్ధమయ్యారు. ఆదివారం కడ్తాలలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. బీదర్ పవర్ గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ ఆధ్వర్యంలో బళ్లారి నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు వేస్తున్న హైటెన్షన్ విద్యుత్ లైన్ నిర్మాణాన్ని నిలిపేయాలని సోమవారం నుంచి రిలే దీక్షలు చేపడుతామని రైతులు, నాయకులు ప్రకటించారు. విద్యుత్ టవర్లతో తాము రోడ్డున పడతామని తెలిపారు. ఉన్నతాధికారులు, ట్రాన్స్ మిషన్ కంపెనీ అధికారులు స్పందించనందునే రిలే నిరాహార దీక్షలను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. మొదట ఇతర ప్రాంతాల మీదుగా వేయాలనుకున్న లైన్‌ను కొందరు పారిశ్రామివేత్తల ఒత్తిడితో అక్రమంగా కడ్తాల మీదుగా తీసుకుపోతున్నారని రైతులు ఆరోపించారు. టవర్ల నిర్మాణానికి ప్రతిపాదిత ప్రాంతాల్లో కోళ్ల, డెయిరీ ఫారాలు, పరిశ్రమలు, ఫంక్షన్‌హాళ్లు, పండ్ల తోటలు ఉన్నాయని రైతులు తెలిపారు. ఎక్కువగా చిన్న రైతుల భూములే పోనున్నాయన్నారు. రిలే నిరాహార దీక్షల్లో ప్రజలు, వివిధ పార్టీల, సంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కడారి రామకృష్ణ, పెంటారెడ్డి, శివరామకృష్ణ, పర్వతకుమార్, రాములు, రాజేందర్, కేశవులు, శ్రీరాములు, రాజేశ్, యాదయ్య, మల్లేశ్, శేఖర్, వెంకటేశ్, అభిషేక్‌రెడ్డి పాల్గొన్నారు.

నెలనెలా వేతనం వస్తేనే కుటుంబం గడిచేది కష్టం. అలాంటిది నెలలకొద్దీ రాకుంటే ఇక అంతేసంగతులు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని మోడల్ స్కూళ్లలోని బోధన, బోధనేతర సిబ్బంది పరిస్థితి ఇదే. వారికి ఏడు నెలలుగా వేతనాలు అందడం లేదు. దీంతో హౌజింగ్ రుణాలు, ఈఎంఐలను ఎలా చెల్లించాలో తెలియక అయోమయంలో పడ్డారు. ఔట్ సోర్సింగ్ సిబ్బందికి 7 నెలలు, హాస్టల్ సిబ్బందికి 4 నెలలు, అవర్లీ బేస్డ్ టీచర్లకు 3 నెలలుగా జీతాలు అందడం లేదు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలో మొత్తం 18 మోడల్ స్కూళ్లు ఉండగా.. ఇందులో విభాగాల్లో కలిపి సుమారు 1,002 మంది ఉద్యోగులున్నారు.

చేవెళ్ల మోడల్ స్కూల్



వేతన వేదన..!

- ఇబ్బందుల్లో మోడల్ స్కూల్ బోధన, బోధనేతర సిబ్బంది
- కుటుంబాలు గడవడం కష్టంగా మారిందని ఆవేదన
- వెంటనే వేతనాలిచ్చి ఆదుకోవాలని వేడుకోలు
- ప్రభుత్వ ట్రెజరీ ద్వారా వేతనాలివ్వాలని డిమాండ్
- రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో 18 మోడల్ స్కూళ్లు

రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో (స్కూల్స్, ఉద్యోగుల వివరాలు)			
		రెగ్యులర్ టీచర్లు	224
		అవర్లీ బేస్డ్	80
మోడల్ స్కూల్స్	18	అవుట్ సోర్సింగ్	72
బోధన,		ఒకేషనల్ టీచర్లు	36
బోధనేతర సిబ్బంది	500	హాస్టల్ సిబ్బంది	90

ఏడు నెలలుగా అందని జీతం

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా షాబాద్, శంకర్‌పల్లి, మహేశ్వరం.. వికారాబాద్ జిల్లాలోని పరిగి, వికారాబాద్, పెద్దేముల్ మండలాల్లోని మోడల్ స్కూల్స్ మొత్తంగా అవర్‌బేస్డ్ టీచర్లతో బోధన కొనసాగుతుండగా.. మిగతా స్కూల్స్ రెగ్యులర్ ఉపాధ్యాయులతో కొనసాగుతోంది. ఔట్ సోర్సింగ్ సిబ్బందికి మార్చి నుంచి ఆగస్టు వరకు, అలాగే గతేడాది సెప్టెంబరు నెలకు సంబంధించి వేతనాలు అందలేదు. ఓ మోడల్ స్కూల్ పరిధిలో పని చేస్తున్న హాస్టల్ సిబ్బందికి నాలుగు నెలలుగా వేతనాలు అందక నానా అవస్థలు పడుతున్నారు. అవర్ బేస్డ్ టీచర్లకు గత 3 నెలలుగా అందని పరిస్థితి.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మోడల్ స్కూల్ ఉద్యోగులు, సిబ్బంది(ఫైల్)

11 ఏళ్లుగా ఒకేచోట..

ట్రెజరీల ద్వారా 010 పద్దు నుంచి వేతనాలు ఇవ్వాలని ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. ప్రతీ మూడు నెలలకు ఆర్థికశాఖ నుంచి

మిగతా 5వ పేజీలో...



అప్పు చేస్తేనే పూట గడిచేది

ఔట్ సోర్సింగ్ సిబ్బందికి పెండింగ్ జీతాలతో పాటు ప్రతి నెలా సక్రమంగా వేతనాలు చెల్లించాలి. అప్పు చేస్తే తప్ప పూట గడవని పరిస్థితి నెలకొంది. ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి. మా ఉద్యోగులపైన ఉన్న సెంట్రల్ జీఎస్టీని తొలగించాలి. 13 సంవత్సరాలుగా ఒకేచోట పనిచేస్తున్నాం.

-ఉపేందర్, కంప్యూటర్ ఆపరేటర్



ఆలయంలో దర్శించుకుంటున్న జానారెడ్డి, సమరసింహారెడ్డి, చిన్నారెడ్డి

ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

లేమూరు వేంకటేశ్వరాలయాన్ని దర్శించుకున్న మాజీ మంత్రులు



లేమూరులో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి

కందుకూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మాజీ మంత్రులు కె.జానారెడ్డి, డీకే.సమరసింహారెడ్డి, జి.చిన్నారెడ్డిలు చెప్పారు. లేమూరులోని మాణ్యంబావి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం వారు దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడారు. నగరానికి చేరువలో ఉన్న లేమూరులో ఈ ప్రసిద్ధ ఆలయం రెండెకరాల విస్తీర్ణంలో ఉందని ఆలయ చైర్మన్ గూడూరు కొండారెడ్డి తమకు చెప్పారన్నారు. ఇక్కడ జలనారాయణ, శివాలయం, గుండం నిర్మాణం, అలాగే శబరిమల అయ్యప్ప ఆలయాన్ని తలపించేలా నూతన గుడిని నిర్మిస్తున్నట్టు స్థానికులు తెలిపారన్నారు. రూ.4.7 కోట్ల వ్యయంతో ఆలయం నిర్మిస్తుండటం సంతోషకరంగా ఉందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు యువత ముందుకు రావాలన్నారు. ప్రజలు దైవ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమయంలో స్వామీజీ సుదర్శనాచార్యులు, ఆలయ నిర్మాణ కర్త శివనాగిరెడ్డి, మహేశ్వరం ఏఎంసీ వైస్ చైర్మన్ యాదయ్య, మాజీ ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సరికొండ పాండు, లేమూరు మాజీ సర్పంచ్ గణేశ్, ఆలయ కమిటీ సభ్యులు కె.భూపాల్‌రెడ్డి, కె.రఘు, ఢిల్లీ బాలక్రిష్ణ, ఆర్.ఐలయ్య, కె.బీ రప్ప, ఆర్.మల్లేశ్, జగన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కందుకూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా పులిమామిడిలోని 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరాఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ వేణుగోపాల్‌రెడ్డి ఆదివారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కారణంగా ధన్నారం, చిప్పలపల్లి, చిప్పలపల్లి గ్రామాల్లో వ్యవసాయ, గృహ విద్యుత్ కనెక్షన్లకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

తిమ్మాపూర్-స్టేషన్ తిమ్మాపూర్

బైపాస్ రోడ్డుకు మోక్షం

- ప్రయాణికులకు తీరనున్న ఇబ్బందులు

4



చంద్ర గ్రహణం.. మూసివేత

- గుళ్లకు తాళం.. సంప్రోక్షణ అనంతరం నేడు దర్శనాలు



మూసివేసిన మైసిగండి మైసమ్మ ఆలయం

కడ్తాల్/మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం నేపథ్యంలో కడ్తాల మండల మైసిగండి మైసమ్మ, శివరామాలయాలను ఆదివారం మూసివేశారు. ఉదయం 11గంటలకు పూజల అనంతరం తాళం వేశారు. సోమవారం తెల్లవారు జామున సంప్రోక్షణ అనంతరం ఆలయాన్ని ఉదయం 8గంటల తెరుస్తామని ఆలయ ఫౌండర్ ట్రస్టీ రామావత్ సిరోలి పంతూ, ఈవో స్నేహలత తెలిపారు. అలాగే తెలంగాణ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన మొయినాబాద్ మండలం చిలుకూరు బాలాజీ ఆలయాన్ని చంద్రగ్రహణం కారణంగా మూసివేసినట్టు ప్రధానార్చకులు సీఎస్.రంగరాజ్ తెలిపారు. పూజల అనంతరం ఆదివారం సాయంత్రం 4గంటల నుంచి ఆలయాన్ని మూసేశామని చెప్పారు. తిరిగి సోమవారం ఉదయం 8గంటలకు సంప్రోక్షణ, ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం ఆలయాన్ని తెరిచి భక్తులకు దర్శనాలు కల్పిస్తామని రంగరాజన్ వివరించారు.



బాలాజీ ఆలయాన్ని మూసివేస్తున్న అర్చకులు రంగరాజన్



తీరని యూరియా వెతలు

గంటలోనే లారీ లోడ్ ఖాళీ!

యాచారం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): వరి, మొక్కజొన్న పంటలకు యూరియా అత్యవసరం కావడంతో ఆ ఎరువు కోసం రైతులు ఆదివారం యాచారం సొసైటీ వద్ద బారులు తీరారు. ఉదయం 8గంటలకే క్యూకట్టారు. 10గంటలకు యూరియా లోడ్ రాగానే పోలీసుల పర్యవేక్షణలో 550బస్తాల యూరియాను పంపిణీ చేశారు. సొసైటీ సీఈవో నాగరాజు స్లిప్‌లు అందించి ఒక్కో రైతుకు రెండుబస్తాల చొప్పున పంపిణీ చేశారు. గంటలోనే లారీ లోడ్ ఖాళీ అయ్యింది. మరో మూడు రోజులకు 550 బస్తాల యూరియా వస్తుందని ఏవో రవినాథ్, సొసైటీ సీఈవో తెలిపారు. సీఐ నందీశ్వర్‌రెడ్డి సిబ్బందితో పర్యవేక్షించి పంపిణీ చేయించారు.

పక్కాగా టీచర్ల హాజరు

పాఠశాలల్లో ఎఫ్ఆర్ఎస్ విధానం అమలు

- ఉపాధ్యాయుల గైర్హాజరు, ఆలస్యాలకు చెక్
- ఉత్తమ బోధనే లక్ష్యంగా అమల్లోకి



చేవెళ్ల బాలికల పాఠశాలలో ఫేస్ రికగ్నిషన్ ద్వారా విద్యార్థిని అటెండెన్స్ వేస్తున్న టీచర్

చేవెళ్ల, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల అక్రమ అటెండెన్సులు, ఆలస్యానికి చెక్ పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో ఎఫ్ఆర్ఎస్(ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్) విధానానికి శ్రీకారం చుట్టింది. ఈ సిస్టం ప్రభుత్వ పాఠశాలల్లో ఆగస్టు 1వ తేదీ నుంచి అమల్లోకొచ్చింది. విద్యార్థుల హాజరు ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ ప్రక్రియ ఇప్పటికే కొనసాగుతోంది. ప్రభుత్వ ఉపాధ్యాయులు టైం టేబుల్ పాటించడం లేదని, ఆలస్యంగా వస్తున్నారని, హాజరు కాకుండానే

మిగతా 6వ పేజీలో...



ఉత్తమ ఫలితాలొస్తాయి

ఫేస్ రికగ్నిషన్ విధానంతో పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలొస్తాయి. ఈ విధానంలో సాంకేతిక సమస్యలు రాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రభుత్వ నిర్ణయంతో ఉపాధ్యాయుల గైర్హాజరీకి, ఆలస్యానికి చెక్ పడింది. టీచర్లలో విధుల పట్ల నిబద్ధత పెరిగింది. చిన్నచిన్న సమస్యలు ఎదురైనా ఈ విధానం బాగుంది.

- పురందాస్, ఎంఈవో, చేవెళ్ల

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

- నేటి నుంచి 13వ తేదీ వరకు నిర్వహణ
- చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం వెల్లడి



చేవెళ్ల, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి 13వ తేదీ వరకు లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు చేవెళ్ల ట్రాఫిక్ సీఐ ఎస్.వెంకటేశం తెలిపారు. ఆదివారం చేవెళ్లలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధానంగా డ్రంకెన్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడిన వారు సంబంధిత పత్రాలతో (ఆధార్ కార్డు, ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్)లను చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సమార్పించాలని సూచించారు. పట్టుబడినవారికి మెగా లోక్ అదాలత్‌లో తక్కువ జరిమానాతో కేసులు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీఐ సూచించారు.



చిన్నారులకు మెడల్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి

- చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య
- మోకిలలో రాష్ట్ర స్థాయి 11వ కరాటే పోటీలు

శంకర్‌పల్లి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు కరాటేలోనూ రాణించాలని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. మోకిలలో ఆదివారం పీఆర్ఆర్ గార్డెన్‌లో రాష్ట్ర 11వ కరాటే (సక్సెస్ షోటోకాన్ కరాటే దూ-ఇండియా) చాంపియన్‌షిప్-2025 పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు నీలం మధుతో కలిసి ఎమ్మెల్యే విజేతలకు బహుమతులు, ప్రశంశపత్రాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కరాటేతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. శారీరక దారుఢ్యం, మానసిక వికాసం కలుగుతాయని తెలిపారు. మహిళలు ఆత్మరక్షణ కోసం కరాటే తప్పక నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రీడలను తమ దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందజేస్తుందన్నారు. కరాటే పోటీల నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకుడు టి.కుమార్, స్పాన్సర్ మన్నె వెంకటేశ్, ఎస్ఎస్‌కేఐ టెక్నికల్ అడ్వైజర్ రవిందర్ కుమార్, ఎస్ఎస్‌కేఐ ఫౌండర్ అనిల్‌కుమార్, చీఫ్ ఆర్గనైజర్ కుమార్, కోచ్‌లు శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.

పీఎస్ నిర్మాణంపై కమ్ముకున్న నీలినీడలు



మేడిపల్లిలో అద్దె భవనంలో ఉన్న పోలీస్ స్టేషన్

- కుర్మిద్దలో గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ ఏర్పాటు పెండింగ్
- అద్దె భవనంలో కొనసాగుతున్న స్టేషన్
- దూరభారంతో ప్రజల ఇక్కట్లు

కుర్మిద్దలో స్టేషన్ భవనానికి కేటాయించిన స్థలం



యాచారం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్మిద్దలో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. కుర్మిద్దలో స్టేషన్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు మూడుమార్లు సందర్శించినా భవన నిర్మాణంపై కదలిక లేదు. ప్రస్తుతం మేడిపల్లిలో ఉన్న గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలంటే ప్రజలకు వ్యయ ప్రయాసలు

మిగతా 6వ పేజీలో...

పోలీస్ స్టేషన్ నిర్మాణాన్ని త్వరలో చేపడతాం



కుర్మిద్దలో పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణ పనులను త్వరలోనే ప్రభుత్వం చేపట్టనుంది. ఇందుకు సంబంధించి క్లియరెన్సులు ప్రగతిలో ఉన్నాయి. భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే పనులు చేపడతాం. స్థలం కేటాయింపు విషయంపై అధికారులకు నివేదిక అందింది.

- కేపీవీ రాజు, ఏసీపీ, ఇబ్రహీంపట్నం

యూరియా కోసం బారులు

కులకచర్ల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు కుస్తీ పట్టాల్సివస్తోంది. ఆదివారం కులకచర్ల ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి 225 బస్తాల యూరియా వచ్చింది. విషయం తెలుసుకున్న రైతులు ఉదయాన్నే ఫర్టిలైజర్ షాపు ఎదుట బారులు తీరారు. రైతులు ఒకరిని ఒకరు తోసుకున్నారు. నిర్వాహకులు రైతుకు బస్తా చొప్పున పంపిణీ చేశారు.





వంశీచంద్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న విష్ణువర్ధన్

విపక్షాల కుట్ర రాజకీయాలను ఎండగట్టాలి

● సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకుపోయి స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు కార్మోణులు కావాలని, విపక్షాల విషప్రచారాలు, కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, పీసీసీ డీలిమిటేషన్ కమిటీ చైర్మన్, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీ చంద్ రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌గా నియమితులైన కడ్తాల మండలం కర్కల్ పహాడ్ గ్రామానికి చెందిన విష్ణువర్ధన్ ఆదివారం వంశీచంద్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమనగల్లుబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహతో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కాంగ్రెస్ సోషల్ మీడియా నాయకులతో వంశీచంద్‌రెడ్డి సమావేశమయ్యారు. పార్టీ పటిష్టత, విపక్షాల వైఫల్యాలను ఎండగట్టడంలో సోషల్ మీడియా పాత్ర అత్యంత కీలకమన్నారు. ప్రభుత్వ పథకాలను సోషల్ మీడియా సభ్యులు ప్రజల్లోకి తీసుకుపోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుంద ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు విజయ సోపానమన్నారు. దేశంలో బీజేపీ మత విద్వేషాలను రెచ్చగొడుతూ ఓటు చోరీ ద్వారా రాజకీయ లబ్ధికి యత్నిస్తుందన్నారు. కాంగ్రెస్సేతర పాలిత రాష్ట్రాల అభివృద్ధి పట్ల వివక్షత చూపుతుందని ఆరోపించారు. దేశంలో ఆధిపత్యం కోసం బీజేపీ సాగిస్తున్న ఓటు చోరీకి అడ్డుకట్ట వేయకపోతే ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదమన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగ లక్ష్మీకాంత్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

తిమ్మాపూర్ - స్టేషన్ తిమ్మాపూర్
బైపాస్ రోడ్డుకు మోక్షం

● తీరనున్న ప్రజల సమస్య

కొత్తూర్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని తిమ్మాపూర్-స్టేషన్ తిమ్మాపూర్ మధ్య బైపాస్ రోడ్డు రానుంది. ఎన్నో ఏళ్లుగా ప్రజలు సతమతమవుతున్న వేళ సమస్య త్వరలో తీరనుంది. ఈమేరకు చెట్లు తొలగించే ప్రక్రియ ప్రారంభమైంది. కొత్తూర్ మున్సిపాలిటీలోని తిమ్మాపూర్-స్టేషన్‌తిమ్మాపూర్ వేర్వేరుగా ఉంటాయి. తిమ్మాపూర్ నుంచి స్టేషన్‌తిమ్మాపూర్‌కు ప్రజలు రావాలంటే 44వ జాతీయ రహదారి గుండా రావాల్సి ఉంటుంది. కిలోమీటర్‌కు పైగా దూరం ఉండడంతో ఎన్నో వ్యయప్రసాలకు ప్రజలకు గురికావాల్సి వచ్చింది. జాతీయ రహదారి ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. తిమ్మాపూర్ నుంచి స్టేషన్‌తిమ్మాపూర్‌కు మధ్యమార్గంలో ఉన్న బండ్లబాట చెట్లతో నిండిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ రోడ్డు కిలోమీటరు పొడవుతో, 30ఫీట్ల వెడల్పుతో ఉంటుంది. తిమ్మాపూర్ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఏనుగు జనార్ధన్‌రెడ్డి పలుమార్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకపోయి బైపాస్ రోడ్డు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇటీవల తిమ్మాపూర్-స్టేషన్ తిమ్మాపూర్ రోడ్డును స్వయంగా పరిశీలించారు. చెట్లు, పిచ్చిమొక్కలతో నిండిపోయిన రోడ్డును వెంటనే తొలగించాలని స్థానిక నాయకులను ఆదేశించారు. అలాగే రోడ్డును వెంటనే సర్వే చేయాలని సంబంధిత శాఖ అధికారులను కూడా అదేశించారు. సర్వే పూర్తికాగానే నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే శంకర్ హామీ ఇచ్చారు. రోడ్డు వేసేందుకు దాదాపు రూ.4 కోట్లు ఖర్చు కావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. తిమ్మాపూర్-స్టేషన్‌తిమ్మాపూర్ బైపాస్ రోడ్డు పూర్తి అయితే స్థానిక ప్రజలతో పాటు మండలంలోని గుడూర్, మల్లాపూర్, మక్తగూడ, పాతిమాపూర్ గ్రామాలు, శంషాబాద్, శాబాద్ మండల ప్రజలకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. ఎమ్మెల్యే కృషితో బైపాస్ రోడ్డు ఏర్పాటు కానుండడంతో మాజీ సర్పంచ్ ఏనుగు జనార్ధన్‌రెడ్డితో పాటు, ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



తిమ్మాపూర్-స్టేషన్ తిమ్మాపూర్ రోడ్డులో జేసీబీతో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న నాయకులు

ఎమ్మెల్యే చొరవ హర్షణీయం



షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో ఎన్నో ఎళ్లుగా ఉన్న సమస్య త్వరలో తీరనుంది. తిమ్మాపూర్ నుంచి స్టేషన్ తిమ్మాపూర్‌కు వెళ్లాలంటే ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురవుతూ వస్తున్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణంతో స్థానిక ప్రజలతో పాటు, కొత్తూర్, నందిగామ మండలాలకు చెందిన ప్రజలకు ఎంతో అనువుగా ఉంటుంది. ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు.

- ఏనుగు జనార్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్, తిమ్మాపూర్

గ్రామీణ రోడ్ల అభివృద్ధికి కృషి

మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

కందుకూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల రోడ్ల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ముచ్చర్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు గ్రామస్తులతో కలిసి ఎమ్మెల్యేను కలిశారు. ముచ్చర్ల నుంచి పోతుబండ తండా వరకు ఉన్న రోడ్డు పనులకు మంజూరైన నిధులతో కాంట్రాక్టర్ పనులు చేపట్టడం లేదని, వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ఇచ్చారు. సబితారెడ్డి స్పందించి వెంటనే కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి ప్రభుత్వం మంజూరు చేసిన రూ:2కోట్ల 72లక్షల నిధులతో పనులు చేపట్టడంలో ఎందుకు జాప్యం జరుగుతందని, వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. అలాగే ముచ్చర్ల గ్రామంలో వీధిదీపాలు లేక రాత్రి వేళల్లో గ్రామస్తులు అవస్థలు పడుతున్నట్లు నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. త్వరలో 5 స్ట్రీట్‌లైట్లను మంజూరు చేయనున్నట్లు ఆమె హామీ ఇచారు. కార్యక్రమంలో నాయకులు డి.మోహన్, బండ నర్సింహ, డి.శ్రీనివాస్, వి.శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ముచ్చర్ల గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులు



ఘట్‌కేసర్‌లో జరిగిన రెడ్డి సంఘం కార్యవర్గంతో ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఐక్యంగా ముందుకు సాగాలి

మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

ఘట్‌కేసర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రెడ్డిలు ఐక్యంగా ఉంటూ ముందుకు సాగాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. చందుపట్లగూడలో గల ఎస్ఎల్ఎన్ ఫంక్షన్‌హల్‌లో జరిగిన ఘట్‌కేసర్ రెడ్డి సంఘం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా రెడ్డిలు కలిసికట్టుగా ఉండాలని పిలుపునిచ్చారు. గతంలో ఘట్‌కేసర్ రెడ్డి సంఘానికి రెండు ఎకరాల స్థలంను కేటాయించేందుకు కలెక్టర్‌తో ఉత్తర్వులు ఇప్పించినట్లు గుర్తు చేశారు. కానీ ప్రభుత్వం మారడంతో ఇప్పటికీ స్థలం కేటాయించలేదనే విషయం తనకు తెలియజేయలేదని చెప్పారు. కాంగ్రెస్ నాయకుడు రెడ్డి సంఘం అధ్యక్షుడిగా ఉన్నప్పటికీ స్థలం కోసం కృషి చేయకపోవడం ఏంటన్నారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఆ స్థలాన్ని సాధించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం సంఘం భవనం నిర్మించేందుకు అందరూ సహకరించాలని, అందుకు తన సహకారం ఉంటుందన్నారు, ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, నూతన కార్యవర్గంతోపాటు మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి మాధవరెడ్డి, లక్ష్మారెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గదిలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన స్థలం

బషీరాబాద్‌లో గుప్తనిధుల వేట

● పాడుబడ్డ భవనంలో తవ్వకాలు
● ఐదుగురిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న పోలీసులు
● ప్రధాన సూత్రధారి పరార్

బషీరాబాద్, సెపెంబరు7 (ఆంధ్రజ్యోతి): గుప్తనిధుల తవ్వకాలు కలకలం రేపాయి. ఓ పాడుబడిన భవనంలో పట్టపగలు నిధుల తవ్వకాల కోసం యత్నిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఐదుగురిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన బషీరాబాద్ మండల కేంద్రంలో ఆదివారం వెలుగుచూసింది. మండల కేంద్రానికి చెందిన ప్రశాంత్‌కుమార్ కిరణా దుకాణం నడిపిస్తున్నాడు. స్థానిక మాజీద్ సమీప మార్గం పక్కన అతడికి చెందిన ఓ పాడుబడిన భవనం ఉంది. ఈ భవనంలో గుప్త నిధులు ఉన్నాయని బలంగా నమ్మిన ప్రశాంత్‌కుమార్ కొంత కాలంగా రోజూ పూజలు చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే గుప్త నిధుల తవ్వకాల కోసం పన్నాగం పన్ని కర్ణాటక ప్రాంతానికి చెందిన ఓ మంత్రగాడిని సన్నిహితులతో కలిసి ఆశ్రయించినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఆదివారం ఉదయం గుప్తనిధుల తవ్వకాల కోసం ప్రశాంత్‌కుమార్ తన సన్నిహితులైన మహేశ్, పి.శ్రీనివాస్, మొహిజ్, శివలతో పాడు బడిన భవనం వద్దకు చేరుకున్నారు. ఆ గదిలో పాత కాలం నాటి పిండి గిర్ని పక్కన గుప్త నిధుల తవ్వకాల కోసం మంత్రగాడితో పూజలు చేయించి ఐదుగురు తవ్వకాలు మొదలుపెట్టారు. ఒక ఫీటు లోతు, నాలుగు ఫీట్ల వెడల్పులో గుంత తీయగా సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ నుమాన్‌అలీ, సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. నిధుల తవ్వకాల్లో పోలీసులకు ఐదుగురు దొరకగా అదుపులోకి తీసుకుని వాహనంలో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గుప్త నిధుల తవ్వకాల్లో ప్రధాన పాత్ర పోషించిన మంత్రగాడు పోలీసులకు దొరకకుండా అక్కడినుంచి పరారయ్యాడు. మంత్రగాడి కోసం పోలీసులు రోజంతా ముమ్మరం ప్రయత్నం చేసిన ఫలితం లేకుండాపోయింది. గుప్తనిధుల తవ్వకాల ప్రాంతాన్ని రూరల్ సీఐ నగేశ్ పరిశీలించారు. గుప్తనిధుల తవ్వకాలకు సంబంధించి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.



బషీరాబాద్‌లో గుప్త నిధుల తవ్వకాలకు ప్రయత్నించిన శిథిల భవనం

నీలకంఠ శతకం పుస్తకావిష్కరణ

బంట్వారం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బంట్వారం మండలం నాగ్వారం గ్రామానికి చెందిన కవి బండి మల్లికార్జున్ సాహిత్య రంగంలో మరో ముఖ్యమైన ముందడుగు వేశారు. షాద్‌నగర్ పట్టణంలో నిర్వహించిన అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక వికారాబాద్, షాద్ నగర్ విభాగంలో ఆదివారం పుస్తకావిష్కరణ, కవి సమ్మేళనం నిర్వహించారు. తెలంగాణ అకాడమీ చైర్మన్ నామోజు బాలబారి ముఖ్య అతిథిగా హాజరై రెండవ కృతిగా నిలకంఠ శతకంను పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023 తొలిసారి బండి వారి మణిపూసలు పుస్తకాన్ని ఆవిష్కరించినట్లు గుర్తుచేశారు. మారుమూల గ్రామం నుంచి కవిగా ఎదగడం గర్వకారణమన్నారు. మల్లికార్జున్ రచనలు తెలుగు సాహిత్యంలో కొత్త ఆవిష్కరణలకు దోహదం చేస్తాయన్నారు. యువ రచయితలకు స్ఫూర్తిగా నిలుస్తాయ అభినందించారు. భవిష్యత్తులో ఆయన విశిష్ట రచనలు చేసి సాహిత్య రంగాన్ని అభివృద్ధి చేయాలని, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక వ్యవస్థాపకులు దొరవేటి చెన్నయ్య, తూర్పు మల్లారెడ్డి, సభాధ్యక్షులు తుల్జారంసింగ్ ఠాకూర్, కమలేష్ పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహిత్య ప్రముఖులు

నిరుపయోగంగా వాటర్ ట్యాంక్

కొడంగల్ రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ప్రతీ గ్రామ పంచాయతీకి ఒక నర్సరీ చొప్పున ఏర్పాటు చేశారు. నర్సరీని బోరు ఉన్న చోట ఏర్పాటు చేసి అక్కడ సింటెక్స్ వాటర్ ట్యాంకులను(వేలాది రూపాయలు వ్యయంతో) పెట్టి నర్సరీలో పెంచిన మొక్కలకు నీటిని పట్టేవారు. అయితే ఎరాన్‌పల్లి గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన నర్సరీ స్థలం రోడ్డు విస్తరణలో పోవడంతో నర్సరీని మరో చోటుకు మార్చారు. గతంలో నర్సరీ దగ్గర ఏర్పాటు చేసిన సింటెక్స్ వాటర్ ట్యాంకును అక్కడే వదిలేశారు. ప్రజాధనం వృథా అవుతున్నా అధికారులు నిమ్మకునిరేత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు.



ఎరాన్‌పల్లి గ్రామ సమీపంలో వృథాగా వాటర్ ట్యాంకు



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న భూబాధితులు

మా భూములను కాపాడండి

పూడూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు పరిధిలో వెళుతున్న భూములను కాపాడాలని భూబాధితులు మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో 60మందికి చెందిన భూములు కోల్పోతున్నామని, ఆ భూములతోనే తమకు జీవనాధారం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న ట్రిబుల్ ఆర్ రీ డిజైన్ చేసి ఇక్కడ తీసుకొచ్చారని, గతంలో ఉన్న మ్యాప్ ప్రకారమే రోడ్డు వేయాలని కోరారు. భూములు కోల్పోతే తమ బతుకులు భారమవుతాయని వాపోయారు. ట్రిబుల్ ఆర్ నుంచి తమ భూములు కాపాడుకునేందుకు ఎంతటి త్యాగానికైనా సిద్ధమన్నారు. అనంతరం భూ బాధితులు నూతన జేఏసీని ఏర్పాటు చేశారు. ట్రిబుల్ ఆర్ భూ బాధితుల జేఏసీ కన్వీనర్‌గా పి.వెంకట్‌రెడ్డి, కో-కన్వీనర్లు నవీన్ జోషి, మైబెల్లి, సభ్యులుగా కొండాపురం సాయిరెడ్డి, శరభలింగం, నవాజ్, బెన్నూరు గొరేశం, అమర్‌నాథ్, జబ్బార్, మునీర్, సాధకాలిలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్లు పి.నర్సింహారెడ్డి, రఘునాథ్ రెడ్డి, నాయకులు తాజుద్దీన్, మల్లేశం, శ్యాంసుందర్‌రెడ్డి, సతీష్, రామ చంద్రయ్య, హరీశ్వర్‌రెడ్డి, నజీర్ పాల్గొన్నారు.

బతుకమ్మ ఉత్సవాలకు శ్రీకారం

ఘట్‌కేసర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బతుకమ్మ పండుగ వేడుకలకు ఆదివారం నాడు శ్రీకారం చుట్టారు. పౌర్ణమి నుంచి అమావాస్య వరకు ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలకు పూలు గుచ్చి ఇళ్లముందు ఆడతారు. ఇలా 15రోజుల పాటు ఆడిన అనంతరం అమావాస్య నాడు పెత్తర మాస నాటి నుంచి తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తారు. తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మతో ఉత్సవాలు ముగుస్తాయి. బొడ్డెమ్మల పౌర్ణమి సందర్భంగా ఆదివారం ఇళ్ల ముందు ఆవు పేడ బతుకమ్మలతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.



చందుపట్లగూడలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



దీక్షలో జేఏసీ నాయకులు

గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి

తలకొండపల్లి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని, అంతవరకు పోరాటం కొనసాగిస్తామని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు ప్రకటించారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు ఆదివారం 307వ రోజుకు చేరాయి. దీక్షల్లో జేఏసీ నాయకులు, యువకులు, వివిధ పార్టీల నాయకు లు, మెదక్‌పల్లి, వెంకట్రావ్‌పేట, బొమ్మరాశి పల్లి గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దీక్షలకు మద్దతుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. 11 గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని మాజీ సర్పంచ్ జయమ్మ వెంకటయ్య, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ శరత్‌చంద్ర, ఆంజనేయులుగౌడ్, కార్యదర్శి అనిల్‌లు కోరారు. రాష్ట్రప్రభుత్వం కొత్తగా ఏ ర్పాటుచేసే 11 మండలాల జాబితాలో గట్టిప్పలపల్లిని చేర్చాలని, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని కోరారు.



సంఘం నాయకులతో శ్రీనివాస్

భవన నిర్మాణ కార్మికులకు ఇళ్ల స్థలాలివ్వాలి

కందుకూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డులు మంజూరు చేసి.. నిరుపేదలను గుర్తించి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీఐటీయూ మండల కార్యదర్శి బుడ్డీరపు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని ఆకులమైలారం గ్రామంలో ఏర్పాటు చేసిన భవన నిర్మాణ కార్మికుల జనరల్‌బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల శ్రమతోటి పెద్ద పెద్ద భవనాలను నిర్మించినవారు ఉండడానికి ఇల్లు లేక చాలా ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండలశాఖ అధ్యక్షుడు బండి సత్తయ్య, కార్యదర్శి శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

సరళారెడ్డికి సన్మానం

బషీరాబాద్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో సుస్థిర వ్యాపారవేత్తగా గుర్తింపు పొంది అవార్డు అందుకున్న ఆర్బీవోఎల్ ఎండీ.బుయ్యని సరళాశ్రీనివాస్‌రెడ్డిని ఆదివారం బషీరాబాద్ మాజీ ఎంపీపీ కరుణాఅజయ్‌ప్రసాద్ దంపతులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ సెంటర్‌లో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖమంత్రి కిషన్‌రెడ్డి చేతులమీదుగా సరళారెడ్డి బెస్ట్ బిజినెస్ ఎక్సలెంట్ అవార్డు-2025ను అందుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాండూరులోని నివాసంలో కరుణఅజయ్‌ప్రసాద్ దంపతులు ఆమెను కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ చందర్‌నాయక్ తదతరులున్నారు.



తాండూరులో సరళారెడ్డిని సన్మానించిన మాజీ ఎంపీపీ దంపతులు

వేతన వేదన..!

(మూడో పేజీ తరువాయి)

ఆమోదం పొందాల్సి వస్తుందన్నారు. వేతనాలు ఆలస్యంగా ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 010 పద్దు ద్వారా ప్రతీ నెల 1వ తేదీన జీతాలు చెల్లించాలని కోరుతున్నారు. వేతనాల విషయం పక్కన పెడితే.. గత 11 సంవత్సరాల నుంచి బదిలీలు లేక ఒకే చోట విధులు నిర్వహిస్తున్నామని వాపోతున్నారు.

ఇబ్బందుల్లో వార్డెన్లు, వంట నిర్వాహకులు

రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలో మొత్తం 18 మోడల్ స్కూల్స్ ఉన్నాయి. మోడల్ స్కూల్లో చదువుకుంటున్న ఇంటర్ విద్యార్థినులకు ప్రభుత్వం పక్కనే వసతి గృహాన్ని ఏర్పాటు చేసింది. ఒక్కో మోడల్ హాస్టల్‌లో వంద మంది విద్యార్థినులు ఉంటున్నారు. రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల, షాబాద్, ఇబ్రహీంపట్నం పరిధిలోని బొంగలూరు, శంషాబాద్ మండలంలోని పాల్మాకుల, యాచారం పరిధిలోని గున్‌గల్, మహేశ్వరం, మంచాల పరిధిలోని ఆరుట్ల, కందుకూరు, శంకర్‌పల్లిలో మోడల్ స్కూల్స్ కొనసాగుతున్నాయి. శంకర్‌పల్లి మినహా అన్ని మండలాల్లో ఇంటర్ విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం ఉంది. అలాగే వికారాబాద్ జిల్లాలో పూడూరు మండలం ఎన్కేపల్లి, తాండూరులోని జినుగుర్తి, పరిగిలోని జాఫర్‌పల్లి, కుల్కచర్ల పరిధిలోని ముజాయత్‌పూర్, నవాబుపేట, మర్పల్లిలో మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఒక్కో మోడల్ స్కూల్ ఇంటర్ విద్యార్థినుల హాస్టల్‌లో వార్డెన్/కేర్ టేకర్ ఉంటుంది. వార్డెన్‌కు నెలకు రూ.12,500 చొప్పున నాలుగు నెలల వేతనం రావాల్సి ఉంది. అలాగే వాచ్‌మెన్‌కు రూ.8,710, ఏఎన్ఎంకు రూ.7,800, హెడ్ కుక్‌కు రూ.7,800, ఇద్దరు అసిస్టెంట్ కుక్‌లకు ఒక్కొక్కరికి రూ.6,500 చొప్పున నాలుగు నెలలకు సంబంధించి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి.

ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయాలి



ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేసినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం, ఏజెన్సీల తప్పిదంతో ఔట్ సోర్సింగ్ సిబ్బందికి నెలలుగా వేతనాలు అందడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలి. ఏజెన్సీ వ్యవస్థను పూర్తిగా రద్దు చేసి, ప్రతి నెలా వేతనాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలి.

-ఆంజనేయులు, పీడీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

యథేచ్ఛగా నాపరాళ్ల దోపిడీ



జీవన్గి శివారులో నాపరాళ్ల గనుల్లో అక్రమ తవ్వకాలు

బషీరాబాద్ మండలంలో ఆగని అక్రమ తవ్వకాలు

- రాయల్టీ లేకుండానే రవాణా
- పట్టించుకోని మైన్స్, రెవెన్యూ అధికారులు

బషీరాబాద్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల్లో నాపరాళ్ల అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. లీజుల పేరిట కొందరు, అక్రమంగా ప్రభుత్వ భూములను కబ్జా చేసి మరి కొందరు వనరులను దొరికినకాడికి దోచేస్తున్నారు. చెరువుల శిఖం, ఆర్అండ్‌బీ రోడ్లు, రైల్వే పట్టాల పక్కన భూములను కబ్జా చేసుకుని అక్రమ తవ్వకాలు జోరుగా చేపడుతున్నారు. మైన్స్‌లీజులు, రాయల్టీలు లేకుండానే కొందరు విలువైన నాపరాళ్ల నిక్షేపాలను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బషీరాబాద్ మండలంలోని నవాల్గ, కొర్విచెడ్, మాసన్‌పల్లి, క్యాద్గీరా, జీవన్గి, ఎక్మాయి తదితర గ్రామాల పరిధిలోని ప్రభుత్వ భూముల్లో విరివిగా నాపరాళ్ల నిక్షేపాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో కొందరు వ్యాపారులు లీజుల మాటున అక్రమంగా ప్రభుత్వ భూమి కబ్జాచేసి ప్రభుత్వ సంపదను లూటీ చేస్తున్నారు. కొర్విచెడ్, జీవన్గి, మాసన్‌పల్లి గ్రామాల శివారుల్లో చెరువు శిఖం, ప్రభుత్వ భూముల్లో కొందరు అక్రమంగా నాపరాళ్ల తవ్వకాలు జరుపుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపణలున్నాయి. ఈ ప్రాంతంలో ప్రభుత్వ భూములు, రైల్వే పట్టాల గుండా కొందరు హిటాచీ(యంత్రాలు)లతో అనుకూలంగా ఉన్నప్పుడు నాపరాళ్ల తవ్వకాలు జరుపుతున్నారు. జీవన్గి ఆర్అండ్‌బీ రోడ్డు మార్గం పక్కనే నిబంధనలకు విరుద్ధంగా నాపరాళ్ల తవ్వకాలు జరుపుతునే ఉన్నారు. చెక్‌పోస్టుల్లోని సిబ్బందికి లారీకి ఎంతోకొంత ముట్టజెప్పి అక్రమంగా నాపరాళ్లను తరలించుకుపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ తవ్వకాలు నిరాటంకంగా కొనసాగసాగడానికి రాజకీయ ఒత్తిళ్లు, అధికారుల అండదండలే కారణామన్న ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమ తవ్వకాల నిలుపుదలకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మాసన్‌పల్లి సమీపంలో నాపరాళ్ల గనిలోకి లోడ్ కోసం వచ్చిన లారీ

మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ జాడేదీ!

అక్రమ గని తవ్వకాలు, ఖనిజ సంపద అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ ప్రతీక్ జైన్ జిల్లా, మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో ప్రతీ మండలంలో టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని నాలుగు నెలల కిందట గనులశాఖ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. మండలస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ తహసీల్దార్ నేతృత్వంలో పనిచేయాల్సి ఉండగా, ఈ కమిటీలో స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్ఐ, ఇరిగేషన్ శాఖ ఏఈ, అటవీశాఖ బీట్ ఆఫీసర్, రవాణాశాఖ ఎంవీఐ, లేదా సహాయ అధికారి, గనుల శాఖ నుంచి ఏజీ (సహాయ జియాలజిస్ట్) లేదా రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ అక్రమ మైనింగ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఎక్కడైనా అక్రమాలు జరుగుతుంటే కేసులు, జరిమానాలు విధించాలి. మండల టాస్క్‌ఫోర్సు కమిటీ నెలకొకసారి తన నివేదికను జిల్లా కమిటీకి అందించాల్సి ఉంటుంది. కానీ టాస్క్‌ఫోర్సు కమిటీల జాడ లేదని, అక్రమ నాపరాళ్ల తవ్వకాలపై దృష్టి సారించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

రైతు వేదికల్లో నేడు యూరియా పంపిణీ

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): ఫరూక్‌నగర్ మండలంలోని రైతు వేదికల్లో నేడు(సోమవారం) యూరియా పంపిణీ చేయడం జరుగుతుందని వ్యవసాయ అధికారి నిషాంత్ కుమార్ తెలిపారు. మండలంలోని ఎలికట్ట, వెలిజర్ల, బూర్గుల, మధురాపూర్, చించోడు రైతువేదికల్లో పంపిణీ జరుగుతుందన్నారు. యూరియా కోసం ఈ నెల 6 వరకు టోకెన్లు ఇచ్చిన రైతులు యూరియా కోసం రావాలని అన్నారు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. ఎలికట్ట రైతువేదికలో 200 బస్తాల యూరియా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఫరూఖ్‌నగర్, ఎలికట్ట, మొగిలిగిద్ద, ఎల్లంపల్లి, నాగులపల్లి, హాజీపల్లి, గుండ్లకుంట, కిషన్‌నగర్ గ్రామాల రైతులు రావాలని సూచించారు. వెలిజర్ల రైతు వేదికలో 200 బస్తాల యూరియా అందుబాటులో ఉంటుందన్నారు. వెలిజర్ల, సూర్యారావు తండా, కొండన్నగూడ, కొంగగూడ, చటాన్‌పల్లి, బుచ్చిగూడ, దూసకల్ గ్రామాల రైతులు యూరియా కోసం రావాలని తెలిపారు. చించోడు రైతువేదికలో 200 బస్తాల యూరియా ఉందన్నారు. చించోడు, చౌలపల్లి, భీమారం, కాంసాన్‌పల్లి, కందివనం గ్రామాల రైతులు తీసుకెళ్లాలన్నారు. షాద్‌నగర్ సింగిల్‌విండో 400 బస్తాల యూరియా అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. అక్కడ బూర్గుల, తిమ్మాజీపల్లి, అన్నారం, జోగమ్మగూడ, రాయికల్, విఠ్యాల, మధురాపూర్ క్లస్టర్ పరిధి మధురాపూర్, శేరిగూడ, గంట్లవెల్లి, కమ్మదనం, చిల్కమర్రి, సోలీపూర్, రామకృష్టాపురం గ్రామాల రైతులు యూరియా తీసుకోవాలని తెలిపారు.

త్వరలో పల్లెలకు పాలనాధికారులు

- రెవెన్యూ వ్యవస్థలో కీలకం కానున్న జీపీవోలు
- క్లస్టర్‌కు ఒక్కరి చొప్పున గ్రామ పరిపాలన అధికారి



తాండూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): త్వరలో గ్రామాలకు పాలనాధికారులు రాబోతున్నారు. క్లస్టర్లకు ఒకరు చొప్పున నియామకం జరిగే అవకాశం ఉంది. ఇటీవల నియామకపత్రాలు అందుకున్న గ్రామ పరిపాలన అధికారులకు త్వరలో బాధ్యతలు అప్పగించనున్నారు. జిల్లాలో 594 పంచాయతీలు, 213 క్లస్టర్లు ఉన్నాయి. ప్రస్తుతం 137మందికి నియామక ఉత్తర్వులు ఇచ్చారు. ఇక నుంచి ప్రతీ గ్రామానికి సంబంధించి భూముల నిర్వాహణ, ప్రభుత్వ సంక్షేమపథకాల అర్హుల ఎంపిక, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వాహణతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ భూముల సర్వే నంబర్లు, చెరువులు, కుంటలు, శిఖం భూములు, ఎఫ్‌టీఎల్, బంఫర్ జోన్ల పర్యవేక్షణ వంటి ప్రభుత్వ పరిపాలన వ్యవహారాలన్నీ జీపీవోలు పర్యవేక్షిస్తారు. పోస్టులను సోమవారం నాటికి కేటాయించనున్నారు. గ్రామస్థాయిలో భూఖాతా నిర్వాహణ, పహాణీల నమోదు, రెవెన్యూ మాతృదస్తం నిర్వాహణ, అన్ని రకాల భూముల నిర్వహణ, మార్పులు, చేర్పులు అసైన్డ్ దేవాదాయ, లావుణి, వక్ఫ్, ప్రభుత్వం సేకరించే భూముల నిర్వాహణ, ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, నీటి వనరుల కింద భూముల సంరక్షణ, భూమి ఖాతాల నిర్వాహణ, మార్పులు, చేర్పులు, భూసేర్వేకు సహకారం, ప్రకృతి విపత్తులకు వాటికి నష్టం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హుల ఎంపికలో విచారణ, జనన, మరణ విచారణలు, ఎన్నికల సమయంలో గ్రామ స్థాయిలో సహకారం వంటి వాటిపై బాధ్యతలు నిర్వహించనున్నారు. గ్రామస్థాయిలో కీలక పాత్ర పోషించనున్నారు. రెవెన్యూ వ్యవస్థ సజావుగా నడిపేందుకు ఈ వ్యవస్థ ఎంతో ఉపయోగపడనుంది. వీఆర్వో వ్యవస్థ రద్దు అయిన తర్వాత ప్రత్యేక అధికారులు లేకపోవడంతో గ్రామాల్లో పాలన వ్యవస్థ అంతా కుంటుపడింది.

రెవెన్యూ వ్యవస్థ పునరుద్ధరణ అభినందనీయం



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించి గ్రామ పరిపాలన అధికారులను నియమించడం అభినందనీయం. వికారాబాద్ జిల్లా తరుపున ప్రభుత్వానికి కృతజ్ఞతలు. గ్రామ పరిపాలన వ్యవస్థ పునరుద్ధరణతో రెవెన్యూ వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు సాధారణ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రజాపాలన అధికారులు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తారు, గ్రామస్థాయిలో రెవెన్యూ పరిపాలన వ్యవస్థ ఎంతో దోహదపడుతుంది.

- విజేందర్, జిల్లా ట్రెసా అధ్యక్షుడు

గత ఇన్‌చార్జి కమిషనర్ మెడకు బిగుస్తున్న ఉచ్చు

- ఏసీబీకి అప్పటి కమిషనర్‌పై ఫిర్యాదుదారుడి స్టేట్‌మెంట్



తాండూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపల్‌లో ఇటీవల ఏసీబీ దాడుల్లో పట్టుబడిన జూనియర్ అసిస్టెంట్ రమేశ్ అవినీతిలో అప్పటి మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ విక్రం సింహారెడ్డి ప్రమేయం ఉందని మున్సిపల్ అవినీతిపై ఫిర్యాదు చేసిన ఈర్షద్ అనే వ్యక్తి తాజాగా ఏసీబీకి కమిషనర్‌పై స్టేట్‌మెంట్‌ను ఇచ్చారు. కోర్టుకు కూడా ఇదే స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అయితే ఏసీబీకి పట్టుబడిన జూనియర్ అసిస్టెంట్ రమేశ్ తాను తీసుకున్న లంచంలో అప్పటి ఇన్‌చార్జి కమిషనర్‌కు వాటా ఉందని ప్రతీ వారానికి ఒకసారి వసూలైన మామ్ముళ్లు ఇవ్వాల్సి వచ్చేదని తన ముందే ఏసీబీ అధికారులకు స్టేట్‌మెంట్ ఇచ్చారని ఈర్షద్ పేర్కొన్నారు. దీంతో అప్పటి ఇన్‌చార్జి కమిషనర్ విక్రం సింహారెడ్డిని తాండూరు నుంచి మున్సిపల్ పరిపాలన విభాగం కార్యాలయానికి అటాచ్ చేశారు. ఇప్పటి వరకు పోస్టింగ్ ఇవ్వలేదు. ఇప్పటికే ఏసీబీ అధికారులు తమకు అప్పటి కమిషనర్ విక్రం సింహారెడ్డి సహకరించలేదని రికార్డులు ఇవ్వకుండా ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారని మున్సిపల్ పరిపాలన విభాగం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయనకు మెమో జారీ చేశారు. బాధితుడు, ఫిర్యాదుదారుడు స్టేట్‌మెంట్లతో అప్పటి ఇన్‌చార్జి కమిషనర్ విక్రం సింహారెడ్డికు ఉచ్చు బిగుస్తోంది.

ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శప్రాయులు

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి,సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శప్రాయులని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగి, గడిసింగాపూర్ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలుగా పదవీ విరణమ పొందిన బి.కృష్ణారెడ్డి, అనంత్‌రావులను ఆదివారం ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. జీహెచ్‌ఎంలుగా పదోన్నతి పొందిన విజయ్‌కుమార్, వెంకటేశం, రూప్‌సింగ్‌లను కూడా ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగాల్లోని అన్ని ఉద్యోగాల కంటే ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదన్నారు. ఉపాధ్యాయులు తమ సర్వీసులో ఎంతోమందిని ఉన్నతులుగా తీర్చిదిద్దగలుగుతారని చెప్పారు. బాధ్యతతో పనిచేసే ఉపాధ్యాయులు విద్యార్థుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. విధి నిర్వహణలో ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేస్తే ప్రజల నుంచి ప్రశంసలు అందుకుంటారని చెప్పారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేవిధంగా బాధ్యతగా పనిచేయాలన్నారు. పదవీవిరమణ పొందిన ఉపాధ్యాయులను ఇతరులు కూడా ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పరుశరాం రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, ప్రధానకార్యదర్శి కె.హన్మంత్‌ముదిరాజ్, ఎంఈవో గోపాల్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు డి.అమర్‌నాథ్, రామాంజనేయులు, బుగ్గయ్య, ఎండీ ఉస్మాన్ అలీ, కావలి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

దోమ: ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొందిన దోమ మండలానికి చెందిన రూప్‌సింగ్‌ను పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని, విద్యారంగ అభివృద్ధికి తన వంతుగా కృషి చేసిన రూప్‌సింగ్ లాంటి ఉపాధ్యాయులు పదోన్నతి పొందడం గర్వకారణం అన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



పరిగి: పదవీ విరమణ పొందిన కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

తాండూరు: తాండూరు పట్టణంలోని వినాయక కన్వెన్షన్ హాల్‌లో శనివారం రాత్రి నియోజకవర్గంలోని ఉత్తమ ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సన్మానించారు. విద్యార్థులకు భవిష్యత్తు నిర్వహించేది ఉపాధ్యాయులేనని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మురళి కృష్ణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వికారాబాద్: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేయగా కాలనీ ఉపాధ్యాయుడు అవార్డుకు ఎంపిక కావడంతో కాలనీ వాసులు ఘనంగా సన్మానించారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలోని కలెక్టరేట్ కొత్త కాలనీలో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతగిరి పల్లి ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెంకటయ్య దంపతులను శాలువాలు పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు మోమిన్‌పేట ఆర్ఐ గోవర్దన్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



తాండూరులో ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



వికారాబాద్: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన టీచర్ వెంకటయ్యను సన్మానిస్తున్న కాలనీ వాసులు

బాధిత కుటుంబానికి

ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

తలకొండపల్లి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): చుక్కాపూర్‌కు చెందిన రాములయ్య ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని ఆదివారం ఏమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఏమిరెడ్డి పాండురంగారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డిలు పరామర్శించారు. శ్రీనివాస్‌రెడ్డి, పాండురంగారెడ్డి చెరో రూ.2500, ప్రభాకర్‌రెడ్డి రూ.3వేలు, గ్రామ నాయకుడు యాదయ్య రూ.వెయ్యి సమకూర్చగా బాధిత కుటుంబానికి అందజేశారు. నాయకులు జక్కు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, తదితరులు ఉన్నారు.

10న ఉత్తమ టీచర్లకు సన్మానం

ఆమనగల్లు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్నిమండలాలకు చెందిన ఉత్తమ టీచర్లకు ఈనెల 10న సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గోవర్దన్‌రెడ్డి, పీఆర్‌వో ఎంఏ పాషలు ప్రకటనలో తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

విస్తరణకు నోచని ఆమనగల్లు బస్టాండ్

- సదుపాయాల కల్పనలో ఆర్టీసీ నిర్లక్ష్యం
- ప్రతిపాదనలకే పరిమితమైన క్యాంటీన్
- సమస్యలతో ప్రయాణికుల ఇబ్బందులు



బస్టాండ్ ప్రధాన ద్వారం వద్ద కంకర తేలిన రోడ్డు



అరకొర వసతులతో ఆమనగల్లు బస్టాండ్

ఆమనగల్లు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు కనీస వసతులు కరువయ్యాయి. వసతుల కల్పనలో ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం విమర్శలకు తావిస్తోంది. నాలుగు మండలాలకు ప్రధాన కూడలిగా, రాష్ట్ర రాజధానికి చేరువలో శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన ఉన్న ఆమనగల్లు ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి నోచుకోలేదు. నిత్యం వందల బస్సులు, వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్టాండ్ విస్తరణ, అభివృద్ధి విషయంలో ఎవరూ చొరవ చూపడం లేదు. బస్టాండ్ నానాటికీ వ్యాపార సముదాయంగా మారి ఇరుకుగా తయారైంది. ఆర్టీసీ అధికారులకు ఆదాయం పైన ఉన్న ఆశ తప్ప ప్రయాణికులకు సౌకర్యాల కల్పనపై ధ్యాస లేదని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఆమనగల్లు బస్టాండ్ మీదుగా శ్రీశైలం, హైదరాబాద్, యాదగిరి గుట్ట, సంగారెడ్డి, వరంగల్, నర్సంపేట, మాల్, దేవరకొండ, కల్వకుర్తి, అచ్చంపేట, మహబూబ్‌నగర్, కర్నాటక, కొల్లాపూర్, గోదావరిఖని, షాద్‌నగర్, నారాయణఖేడ్ వంటి దూర ప్రాంతాలకు నిత్యం వందల సంఖ్యలో బస్సులు నడుస్తుంటాయి. నేటికీ సరైన సదుపాయాలు సమకూర్చకపోవడం ప్రయాణికులకు శాపంగా మారింది. బస్టాండ్‌లో తాగునీటి సౌకర్యం సరిగా లేదు. వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, స్థానికులు ఏళ్ల కాలంగా అధికారులను కోరుతున్నా స్పందన లేదు. క్యాంటీన్ లేక ప్రయాణికులు ప్రధాన రహదారిపై గల హోటల్స్‌కు వెళ్లాల్సి వస్తుంది. బస్టాండ్ ప్రధాన ద్వారం వద్ద సీసీ లేక కంకర తేలి, గోతులేర్పడి కళాహీనంగా మారింది. ఇకపోతే వాహనాల పార్కింగ్, దుకాణాల ఏర్పాటుతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. కూర్చోవడానికి బెంచీలు, సరైన సదుపాయాలు కూడా లేవు. అధికారులు బస్టాండ్‌ను విస్తరించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



ఆమనగల్లు ఆర్టీసీ బస్టాండ్ ఏళ్ల కాలంగా విస్తరణకు నోచుకోవడం లేదు. ప్రయాణికుల సౌకర్యార్థం ఎలాంటి చొరవ చూపడం లేదు. రెండు దశాబ్దాలుగా బస్టాండ్‌లో వసతులు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నా స్పందన లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలి. తాగునీటికి వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలి. ఇందుకు దాతలు ముందుకు రావాలి.

- కోట కృష్ణయ్య, ఆమనగల్లు

బస్టాండ్ విస్తరణలో నిర్లక్ష్యం



ఆమనగల్లు ఆర్టీసీ బస్టాండ్‌ను విస్తరించాలని దశాబ్ద కాలంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాం. ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించాం. అయినా, స్పందన లేదు. కల్వకుర్తి ఆర్టీసీ డిపోకు ప్రధాన ఆదాయ మార్గమైన ఆమనగల్లు ఆర్టీసీ బస్టాండ్ విస్తరించి ప్రయాణికులకనుగుణంగా సదుపాయాలు కల్పించాలి. స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

- వత్యనాయక్, బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఆమనగల్లు

క్రైం కార్నర్

ఫోర్క్‌లిఫ్ట్ కింద పడి ఆపరేటర్ మృతి



మహేశ్ (ఫైల్)

తలకొండపల్లి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఫోర్క్‌లిఫ్ కిందపడి ఆపరేటర్ మృతిచెందిన ఘటన ఆదివారం తలకొండపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని శ్రీ వెంకటేశ్వర మినరల్ కంపెనీలో నాలుగు సంవత్సరాలుగా మండల కేంద్రానికి చెందిన మహేశ్(25) ఫోర్క్‌లిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో ఒక లారీలో పౌడర్‌ను లోడ్ చేసి తిరిగి వెనక్కి వచ్చే క్రమంలో లారీని ముందుకు తీయగా ఫోర్క్‌లిఫ్ట్ కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. దాంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. నిర్లక్ష్యంగా లారీ నడిపిన డ్రైవర్ వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు చెప్పారు. మృతుడు మహేశ్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ వెంకటేశ్వర మినరల్ కంపెనీ ఎదుట మృతుడి కుటుంబికులు, బంధువులు ఆందోళనకు దిగారు.

గణేశ్ మండపం వద్ద గొడవ.. పలువురిపై కేసు

కొత్తూర్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనంలో భాగంగా మున్సిపాలిటీలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఓ వినాయక మండపం వద్ద శనివారం రాత్రి జరిగిన గొడవ కారణంగా పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకుడు కర్రోళ్ల సురేందర్ మండపం మీదుగా వెళ్తూ స్పీకర్ సౌండ్ విషయంలో మండపం నిర్వాహకులను ప్రశ్నించారు. ఈక్రమంలో వారి మధ్య గొడవ చోటుచేసుకుంది. దాంతో మండపం నిర్వాహకులు దాడి చేశారని సురేందర్‌పై తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు శివచారి, సాగర్, అనిల్, సాయి, రమేష్, శ్రీకాంత్, చందులతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

- నందిగామ మండలం నూజివీడు పరిశ్రమ సమీపంలో ఘటన



నందిగామ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): నందిగామ పోలీస్‌స్టేషన్ పరి ధిలోని నూజివీడు పరిశ్రమ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి అనుమానా స్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం నూజివీడు పరిశ్రమ శివారులోని పాత జాతీయ రహదారి పక్కన ఓ వ్యక్తి చనిపోయి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు మృతదేహాన్ని పరిశీలించి షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు.కాగా, మృతదేహంపై ఎలాంటి దుస్తులు లేవని కట్ డ్రాయర్ మాత్రమే ఉందని, వయస్సు 50 నుంచి 60 సంవత్సరాలు మధ్య ఉండవచ్చని పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

జీఎస్టీ కొత్త స్లాబ్‌లతో పేదలకు మేలు



శంకర్‌పల్లి : మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

శంకర్‌పల్లి/కడ్తాల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) జీఎస్టీ స్లాబ్‌లు తగ్గడంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాములుగౌడ్ తెలిపారు. జీఎస్టీ స్లాబ్‌లు కేంద్ర ప్రభుత్వం తగ్గించడం పట్ల బీజేపీ నాయకులు ఆదివారం శంకర్‌పల్లి చౌరస్తాలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ స్లాబ్‌లు తగ్గించడం శుభపరిణామమని అన్నారు. ప్రజల కొనుగోలు శక్తి పెరిగి వికసిత్ భారత్ వైపు దేశం పయనిస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ శంకర్‌పల్లి మున్సిపల్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు బయన్న, జిల్లా కౌన్సిల్ సభ్యులు వాసుదేవ్, మండల ఉపాధ్యక్షుడు దండు రామ్‌మోహన్, శ్రీకాంత్ రెడ్డి, దేవ ప్రవీణ్, కార్యదర్శులు పండిత్‌రావు, రామ్‌మోహన్‌రెడ్డి, బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శులు వెంకటేష్, సానికె ప్రవీణ్, నర్సింహ. నాయకులు పాండురంగం, రాజమల్లేష్, కుమార్, రాజేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం నిత్యావసర సరుకులు, ఆరోగ్య బీమాపై జీఎస్టీ తగ్గించడం పట్ల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మక్తమాదారంలో దళిత మోర్చా జిల్లా నాయకుడు నింగ్యారి ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేశ్‌గౌడ్, రమేశ్, నర్సింహ, చిన్న, సత్తయ్య, రామయ్య, చంద్రయ్య, కాశయ్య, శ్రీరాములు తదితరుల పాల్గొన్నారు.



కడ్తాల్ : మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

భక్తిశ్రద్ధలతో శాంతి హోమం



పూజలో గ్రామస్తులు, తదితరులు

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలంలోని పెద్దషాపూర్ శివరామాంజనేయస్వామి ఆలయ ఆవరణలో మూడు రోజుల పాటు నిర్వహించిన శాంతి హోమం ఆదివారంతో ముగిసింది. శుక్ర, శని, ఆదివారాల్లో వేద పండితలతో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన హోమంలో గ్రామస్థులు పాల్గొన్నారు. నల్గొండ జిల్లా మేళ్లచెరువు గ్రామానికి చెందిన త్రిశక్తిఆత్మక చండీ పీఠం అధిపతి రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో మూడురోజుల పాటు చండీహోమం, గణపతి హోమం, నరసింహ హోమం, రుద్రయాగంతో పాటు ఔరపూర్వక వృద్ధ ఏకాదశి మహోత్సవం నిర్వహించారు. కాగా, రెండు నెలల్లో గ్రామంలో 8 మంది మృత్యువాత పడటంతో గ్రామస్థులు శాంతిహోమం జరిపించాలని తీర్మానించినట్లు మాజీ ఎంపీపీ ఎల్లయ్య ముదిరాజ్, మాజీ సర్పంచ్ సత్యనారాయణగౌడ్, చంద్రశేఖర్ ముదిరాజ్, సీతారామాంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చెక్కల ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు రఘువీర్ పండిత్, ప్రధాన కార్యదర్శి గాదె రాజశేఖర్, ఉప కార్యదర్శి దేవులపల్లి సత్యనారాయణగౌడ్, కోశాధికారి గంద్రాతి కృష్ణారావు, సభ్యులు గాదె చంద్రశేఖర్, తాళ్లపల్లి మహేందర్, తాళ్లపల్లి గణేశ్ ముదిరాజ్, గోనెల గోవర్ధన్, గండి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కలతో విద్యార్థుల బెంబేలు



చౌదరిగూడ జెడ్పీహెచ్ఎస్‌లో సంచరిస్తున్న కుక్కలు, పందులు

చౌదరిగూడ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కుక్కలు పాఠశాల ఆవరణలో స్వైరవిహారం చేస్తూ విద్యార్థులను బెంబేలెత్తిస్తున్నాయి. జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ప్రహరీ శిథిలావస్థకు చేరింది. కొన్ని చోట్ల గోడలు దెబ్బతిన్నాయి. దాంతో కుక్కలు నిత్యం పాఠశాల ఆవరణలోకి వస్తున్నాయి. మధ్యాహ్న సమయంలో భోజనం చేసేందుకు బయటకు వస్తుండటంతో విద్యార్థులపై ఎప్పుడు దాడి చేస్తాయో తెలియని పరిస్థితి. కుక్కలతో పాటు పందులు పాఠశాల ఆవరణలో సంచరిస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి పాఠశాల ప్రహరీకి మరమ్మతులు చేయాలని, కుక్కల బెడద నుంచి విద్యార్థులకు రక్షణ కల్పించాలని ఈసందర్భంగా కోరుతున్నారు.

మల్లికార్జున కాలనీ అభివృద్ధి కమిటీ



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న కాలనీవాసులు

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలోని పరిగి రోడ్డులో గల మల్లికార్జున కాలనీ అభివృద్ధి కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బర్మలి జంగయ్య, ప్రధాన కార్యదర్శిగా మంచన్‌పల్లి రమేష్‌గౌడ్, గౌరవ అధ్యక్షులుగా ఆగీరు శ్రీనివాస్ గుప్త, పురుషోత్తం, ఉపాధ్యక్షులుగా కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, బి. రాజేష్, గుర్రంపల్లి మల్లేష్‌యాదవ్, కోశాధికారిగా రఘునాయక్, కార్యదర్శులుగా పరమేశ్వర్‌రెడ్డి, రమేష్‌గౌడ్, మల్లారెడ్డి, హరీష్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికైన కార్యవర్గ సభ్యులను కాలనీపెద్దలు సన్మానించారు.

పక్కాగా టీచర్ల హాజరు

(మూడో పేజీ తరువాయి)

అటెండెన్స్ వేసుకుంటున్నారనే తదితర కారణాలతో ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేస్తోంది. టీచర్లు స్కూలుకు రాగానే యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ముఖ గుర్తింపు పని చేస్తుందిలా..

టీజీఎఫ్ఆర్ఎస్ యాప్‌ను టీచర్ స్మార్ట్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఉద్యోగి వివరాలతో లాగిన్ కావాలి. యాప్ ఇన్‌స్టలేషన్ సమయంలోనే టీచర్ కార్యాలయం/పాఠశాల ఆవరణ లాగిట్యూడ్, లాటిట్యూడ్‌లను టెక్నీషియన్ అప్‌లోడ్ చేస్తారు. ఒక్కసారి లాగిన్ అయితే అదే వివరాలతో యాప్‌ను ఉద్యోగి బదిలీ అయ్యేంత వరూ వినియోగించవచ్చు. స్కూలుకొచ్చిన తర్వాత యాప్‌ను ఓపెన్ చేసి క్లాక్ ఇన్ అనే ఆప్షన్‌పై నొక్కితే హాజరైన సమయం ఆన్‌లైన్‌లో పర్యవేక్షణ అధికారికి చేరుతుంది. ఆఫీసులో పని సయమం ముగిసిన తర్వాత క్లాక్ ఔట్ ఆప్షన్‌పై టచ్ చేస్తే విధులు ముగిసినట్టు లెక్క. దీంతో పని గంటలను లెక్కించి పర్యవేక్షణాధికారి హాజరు వేస్తారు.

చేవెళ్ల డివిజన్‌లో ఇదీ లెక్క...

చేవెళ్ల డివిజన్‌లో ప్రభుత్వ, ఆదర్శ, కస్తూర్బాగాంధీ పాఠశాలలు ఉన్నాయి. చేవెళ్ల మండలంలో 70 ప్రభుత్వ పాఠశాలల్లో 305 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. షా బాద్ మండలంలో 56 పాఠశాలల్లో 232 మంది, శంకర్‌పల్లి మండలంలో 56 పాఠశాలలకు 221 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. అలాగే మొయినాబాద్ మండలంలో 51 ప్రభుత్వ పాఠశాలల్లో 224మంది టీచర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఈ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బందికి సైతం ఫేస్ రికగ్నిషన్ అ టెండెన్స్ విధానాన్ని అమలు చేస్తున్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటిస్తున్నారు



ఈ విధానం మొదట మిడ్ డే మీల్స్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అమలు చేశారు. ఇప్పుడు టీచర్లకు, ఉద్యోగులకు ప్రవేశపెట్టడంతో అంతా సమయపాలన పాటిస్తున్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో ఈ విధానాన్ని వర్తింపజేయాలి. బోధన, బోధనేతర సిబ్బంది సైతం ఈ విధానం అమలు మంచి నిర్ణయం.

- నరధీర్, టీపీయూఎస్ గౌరవాధ్యక్షుడు, రంగారెడ్డి జిల్లా

పీఎస్ నిర్మాణంపై కమ్ముకున్న నీలినీడలు

(మూడో పేజీ తరువాయి)

తప్పడంలేదు. ఈ పోలీస్‌స్టేషన్ సాయిరెడ్డిగూడకు 22 కిలోమీటర్లు, ముచ్చర్లకు 18 కిలోమీటర్లు, ఉట్లపల్లికి 15 కిలోమీటర్లు, సార్లరావుల పల్లికి 13 కిలోమీటర్లు, ఆకులమైలారానికి 16 కిలోమీటర్లు ఉండగా.. మీర్‌ఖాన్‌పేటకు 13 కిలోమీటర్లు, మాలాగూడకు 17 కిలోమీటర్లు, కుర్మిద్దకు 9 కిలోమీటర్ల దూరం ఉంది.

అన్ని గ్రామాలకు కేంద్రంగా కుర్మిద్ద

కుర్మిద్దలో పోలీస్‌స్టేషన్ నిర్మిస్తే యాచారం, కందుకూరు మండలాల వాసులకు అనువుగా ఉంటుందని ఈ స్టేషన్ పరిధికొచ్చే గ్రామాల వాసులు ఇప్పటికే చెప్పారు. స్టేషన్‌ను మేడిపల్లి నుంచి కుర్మిద్దకు మార్చేందుకు ఓ స్థల యజమానితో అధికారులు చర్చించారు. దీంతో యజమాని రూ.10లక్షలతో భవనాన్ని నిర్మించాడు. అయితే ఆ ఇంటి పక్కనే పెట్రోల్ బంకు ఉందని, అక్కడ స్టేషన్ ఏర్పాటు సరికాదని అధికారులు ఇప్పుడు చెబుతుండడం అనుమానాలకు తావిస్తోంది.

ఐటీ శాఖ మంత్రి వద్ద ఫైల్ పెండింగ్

కుర్మిద్దలో పోలీస్ స్టేషన్ నిర్మాణ ఫైల్‌ను టీజీఐఐసీ, పోలీస్ అధికారులు రాష్ట్ర ఐటీ శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు పంపారు. అక్కడ పెండింగ్‌లో ఉంది. ఫైల్‌ను ఐదు నెలల క్రితమే మంత్రికి పంపారు. పోలీస్‌స్టేషన్, ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణాల వివరాలను అందులో పొందుపర్చారు. అయితే మంత్రి పేషీ ఇంత వరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే స్టేషన్ నిర్మాణ పనులు మొదలయ్యే అవకాశం ఉంది.

సీఐ గంగాధర్‌కు సన్మానం



కడ్తాల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంతో పాటు గ్రామాల్లో వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాతంగా నిర్వహించినందుకు మండల నాయకులు ఆదివారం సీఐ గంగాధర్, ఎస్ఐ చంద్రశేఖర్‌లను శాలువాలతో సన్మానించారు. నాయకులు ముత్తి కృష్ణ, కంబాలపల్లి అంజి, ఊరడి రమేశ్, మహేశ్, రమేశ్, శ్రీకాంత్, రాజు, మణి, నరేశ్, మహేశ్, తదితరులున్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

కొత్తూర్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని తిమ్మాపూర్‌లో నేడు(సోమవారం) మరమ్మతుల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని స్థానిక ట్రాన్స్‌కో ఏఈ రమేష్‌గౌడ్ ప్రకటనలో పేర్కొన్నారు. 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

హమాలీ సంఘం మండల కార్యవర్గం

తలకొండపల్లి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): హమాలీ సంఘం మండల నూతన కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పెంటయ్య, గౌరవాధ్యక్షులు రమేశ్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.గోపాల్, ఉపాధ్యక్షులుగా లక్ష్మయ్య, కృష్ణయ్య, కోశాధికారిగా రమేశ్ సహాయ కార్యదర్శులుగా మ ల్లయ్య, జంగయ్య, సభ్యులుగా మల్లేశ్, మైసయ్య, దుర్గయ్య, జంగయ్య, మహేశ్, శ్రీను, శేఖర్‌లు ఎన్నియ్యారు.



హమాలీ సంఘం నూతన కార్యవర్గం

ఘనంగా వినాయకుడి నిమజ్జనాలు

పార్వతీ తనయుడు ఏకదంతుడు గంగమ్మ ఒడికి చేరాడు. 11 రోజుల పాటు భక్తులచే నిత్యపూజలందుకున్న గణనాథుడికి ఆదివారం భక్తులు వీడ్కోలు పలికారు. ఉత్సవ కమిటీలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొన్నిచోట్ల సామూహిక కుంకుమార్చనలు చేపట్టారు. వినాయకుడి లడ్డూల వేలంలో భక్తులు పోటీ పడ్డారు. సాయంత్రం నిమజ్జనం చేశారు. కాగా, కొన్నిచోట్ల శనివారం శోభాయాత్ర నిర్వహించగా ఆదివారం తెల్లవారుజాము వరకు నిమజ్జనాలు నిర్వహించారు.



శంకర్‌పల్లి : రూ.9.1లక్షలకు లడ్డూను దక్కించుకున్న శేరిగూడ మాజీ సర్పంచ్ సత్యనారాయణ



కేశంపేట : లింగంధనలో శ్రీరామ యూత్ నిర్వహించిన వేలంలో లడ్డూను రూ. 2,61,000లకు దక్కించుకున్న రఘుపతిరెడ్డి



షాద్‌నగర్ అర్బన్ : శ్రీనగర్‌కాలనీలో వినాయకుడి శోభాయాత్ర



ఆమనగల్లు : సామూహిక కుంకుమార్చనలో మహిళలు



షాబాద్ : గణేశ్ చౌక్ వద్ద వినాయక లడ్డూను రూ.18లక్షల 11వేలకు దక్కించుకున్న మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య



ఆమనగల్లు : గంగమ్మ ఒడికి చేరుతున్న పార్వతీ తనయుడు



శంషాబాద్ రూరల్ : తొండుపల్లి పోచమ్మ ఆలయం వద్ద గణేశుడి లడ్డూను రూ.లక్షా 47వేలకు దక్కించుకున్న మాజీ కౌన్సిలర్ లావణ్య శ్రీనివాస్‌గౌడ్



కందుకూరు : అన్నోజిగూడలో రూ:1,45,500 లకు లడ్డూను కైవసం చేసుకున్న కాకి దశరథముదిరాజ్